క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం



అర్వపల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్‌కు అర్వపల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బస్సులో నుంచి కేసీఆర్, భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ మారిపెద్ది భవాణి, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించడానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం తిరుమలగిరి నుంచి నాగారం మీదుగా తుంగతుర్తికి చేరింది. ఈ సందర్భంగా కేసీఆర్ వాహనం నాగారం చేరుకోగానే బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్ రెండు నిమిషాల పాటు వాహనాన్ని ఆపి ప్రజలకు, కార్యకర్తలకు, అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్యగౌడ్, యారాల రాంరెడ్డి, దోమల బాలమల్లు, ఈదుల కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు



శాలువాలతో సత్కరిస్తున్న నాయకులు

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సామూహిక జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చిలో జన్మదిన వేడుకలను నిర్వహించుకున్న పెన్షనర్లు గాదె వెంకట్‌రెడ్డి, గోపాల్, బొడ్డు వీరయ్య, జనార్దన్‌రెడ్డి, మ్యాతును, దేవయ్య, పర్వతాలు, వెంకటయ్యలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి హమీద్‌ఖాన్, వి.రాములు, జి.సోమయ్య, బి.వీరయ్య, వి.రాంరెడ్డి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నూతనకల్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నూతనకల్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాలు.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన కల్లు గీత కార్మికుడు బింగి లింగయ్య కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి లింగయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి 108 వాహనంలో అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ జె. సైదులు తెలిపారు.

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ విందు



కొమరబండలో ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడరూరల్ : హిందూ, ముస్లింల ఐక్యతకు ఇఫ్తార్ విందు ప్రతీక అని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల 10వ వార్డులో ముస్లింలకు మామిడి రామారావు దంపతులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఏటా ముస్లింలకు రామారావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి పద్మావతి, వంగవీటి రామారావు, జాన్ మహ్మద్, మునీర్, అబ్దుల్, నాగుల్, రఫీ, సీతయ్య, కిట్టు, లక్ష్మీనారాయణ, గోపి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : నడిగూడెం మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన బచ్చలకూరి ముత్తయ్య (55), ఆత్కూరి లాలమ్మ (41) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతులు నిరుపేద కుటుంబాలకు చెందినవారు కావడంతో ఆదివారం అదే గ్రామానికి చెందిన జీఎస్‌సీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండు వెంకట్‌గౌడ్ మృతుల కుటుంబాలకు ఆరు వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఇన్‌చార్జ్ నందిగామ రామారావు, కార్యదర్శి పోలంపల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు దుకాణాల జోరు

- విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టు షాపులు
- మొక్కుబడిగా కేసుల నమోదు
- నియంత్రణలో అధికారులు విఫలం

తిరుమలగిరి : పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలు వెలుస్తుండటంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా మద్యానికి అలవాటు పడుతున్నారు. గ్రామాలకు మద్యం సరఫరా యథేచ్ఛగా సాగుతోంది. తనిఖీలు చేయాల్సిన ఆబ్కారి అధికారులు పట్టించుకోవడం లేదు. కిరాణం దుకాణాల్లో నిత్యావసర సరుకుల మాదిరిగా మద్యం బాటిళ్లు లభిస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బెల్టు దుకాణాల్లో రూ.30 నుంచి రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారు. పట్టపగలే బహిరంగంగా మద్యం కాటన్లను ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నా అడ్డుకునే వారే కరువయ్యారు. మద్యం విక్రయాలు పెరగడం వల్ల గ్రామాల్లో నిత్యం గొడవలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

యథేచ్ఛగా వ్యాపారం..

తుంగతుర్తి నియోజకవర్గం పల్లెల్లోని బెల్టు షాపుల్లో 24 గంటలు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. మద్యంప్రియులు గొలుసు దుకాణాల్లో గంటల తరబడి తిష్ట వేసి మద్యం సేవిస్తున్నా కట్టడి చేసే వారే కరువయ్యారు. దీంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. ఒక్కో గ్రామంలో పది నుంచి ఇరవై గొలుసు దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల్లో వ్యాపారులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తూ రెండు చేతులతో సంపాదిస్తున్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో 50కి పైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. దీనికి తోడు దాబాలలో ఎలాంటి పర్మిషన్లు లేకున్నా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అర్ధరాత్రి వరకు ఈ అమ్మకాలు సాగుతున్నాయి. మద్యంప్రియులు రాత్రి సమయాల్లో మద్యం సేవించి వాహనాలపై వెళ్తుండగా ప్రమాదాలకు గురై చనిపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. కొన్ని హోటళ్లలో కూడా మద్యం అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొద్దిమంది సిబ్బంది నెలవారి మామూళ్లు కూడా తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చొరవ తీసుకొని గొలుసు దుకాణాలను కట్టడి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దాబాలో మద్యం సేవిస్తున్న యువకులు (ఫైల్)

తగిన చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో సిబ్బంది వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. ఎవరైనా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తే వాటిని గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దాబాలలో మద్యం అమ్మకాలు చేస్తే తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తాం.

- లక్ష్మానాయక్,
జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

వృత్తిపై నిబద్ధత, అంకితభావమే ఆభరణం



పదవీ విరమణ పొందుతున్న నాగలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సూర్యాపేట టౌన్ : వృత్తి పట్ల నిబద్ధత, అంకిత భావమే ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి ఆభరణమని సూర్యాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ అన్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నాగలక్ష్మి పదవీ విరమణ మహోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో నాగలక్ష్మి అందించిన ప్రోత్సాహం ఎనలేనిది అన్నారు. వేల మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ఆమె కృషి చేశారన్నారు. ఆమె పదవీ విరమణ పొందినప్పటికీ పాఠశాల అభివృద్ధి కమిటీలో బాధ్యురాలుని చేస్తామని, పాఠశాల అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాలని కోరారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు నాగలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జెడ్పీహెచ్‌ఎస్ అధ్యాపక బృందం, రిటైర్డ్ ఉద్యోగులు దశరథ, కాట్ల విజయకుమార్, కుటుంబ సభ్యులు స్వర్ణ మానస, బడుగు సుమన్, స్వర్ణ పావని, పోరెడ్డి సురేష్, స్వర్ణ లహరి, ఇట్టమల్ల అవినాష్‌లతోపాటు సహచర ఉపాధ్యాయులు, సూర్యాపేట పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చివ్వెంల : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక సహకార సంఘం బ్యాంకు కార్యదర్శి రామనర్సమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బి.చందుపట్ల, పిల్లలజెగ్గుతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్క క్రిష్టారెడ్డి, రామక్రిష్టారెడ్డి, మహేందర్, వీరన్న, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : బి.చందుపట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి రామనర్సమ్మ

నేటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు గాను ధాన్యం కొనుగోలుకు జాజిరెడ్డిగూడెంలో సోమవారం మూడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సెర్ప్ ఏపీఎం మల్లేష్ తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తుంగతుర్తి : మండలంలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఏపీఎం నర్సింహగౌడ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం తుంగతుర్తిలో రెండు, వెలుగుపల్లిలో ఒక కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరిలో వైభవంగా బండ్ల ఊరేగింపు

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బండ్ల ఊరేగింపు, గజసేవా, దోపోత్సవం, తీర్థప్రసాదాల వినియోగం తదితర కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లను అలంకారప్రాయంగా తయారు చేసుకొని రామాలయం ఎదుట ఉన్న గరుడ స్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారికి దూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్ కుమార్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఫణిగిరిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఈస్టర్ పండుగ



చివ్వెంల : ఖాసింపేటలోని బెతస్థ మినిస్ట్రీస్ మందిరంలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

చివ్వెంల : చివ్వెంల మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరణించిన యేసుక్రీస్తు తిరిగి లేచిన రోజున ఈస్టర్ పండుగ జరుపుకుంటున్నట్లు జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ తెలిపారు. ఖాసీంపేట బెతస్థ మినిస్ట్రీస్‌లో పలువురు క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణశ్రీ, హోసన్నా, తీతు, నాగరాజు, యేసుపాదం, బాబు, ఉపేందర్, రాజు, పేతురు, అబ్రహం, కిరణ్, దవాదు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలోని గ్రేస్ డైమండ్ ఇవాంజికల్ చర్చిలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాస్టర్‌లు డి. జాన్‌ప్రకాష్, పద్మరాగం, డాక్టర్ అవిల ప్రభాకర్, ప్రకాష్‌పాల్, లక్ష్మీ, జాషువా, నిరీక్షణమ్మ, ప్రభుదాస్, శ్రీనివాస్, దీవెనమ్మ, చింతం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు. ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగిలేచిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేలోతు చంద్రశేఖర్, పాస్టర్లు కరుణకుమార్, దానియేలు, ఏసురత్నం, యోహాను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అర్వపల్లి : రామన్నగూడెంలోని కల్వరి ప్రేమ మందిరంలో..

ప్రభుత్వ భూమిలో బోర్డు మాయం

కోదాడరూరల్ : కొమరబండ శివారులో వైజంక్షన్ వద్ద గల ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. వివరాలు.. కొమరబండ శివారులో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 48 బై 3ఏ బై 1, 48 బై 3బీ బై 1లో దాదాపు రూ.10 కోట్లకు పైగా విలువ చేసే 1.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని వారం రోజుల క్రితం కొందరు వ్యక్తులు జేసీబీతో శుభ్రం చేస్తుండగా రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి పనులను అడ్డుకొని జేసీబీని పోలీసులకు అప్పగించారు. అనంతరం అధికారులు ఇది ప్రభుత్వ భూమి దీనిలో అక్రమ నిర్మాణాలు చేయరాదని, క్రయవిక్రయలు జరపరాదని హెచ్చరిక చేస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఆ బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు.



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



బోర్డును తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు

పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు

- ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి : బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంతోపాటు ఆ పార్టీ నాయకులు దోచుకుతిన్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ విమర్శించారు. అర్వపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే కేసీఆర్ ఎండిపోయిన పంటల పరిశీలన అంటూ మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ఇక నమ్మే పరిస్థితిలో లేరని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా బీఆర్‌ఎస్ గెలవదని విమర్శించారు. కాంగ్రెస్‌పై బురద చల్లడానికి బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొత్తం కుంభకోణాలమయమైందని అన్నారు. వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టులలో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా పంటలకు వదులుతున్నామని తెలిపారు. వరి పంటలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ రెండో దశ కింద గోదావరి జలాలు వదులుతూ రైతులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. మూడు నెలల కాలంలోనే నియోజకవర్గానికి సుమారు రూ.100 కోట్ల వరకు నిధులను మంజూరు చేయించి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గత ఎన్నికల ముందు తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని.. అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా వడగళ్ల వర్షాలకు రైతులు రూ.5 కోట్ల మేర పంటలు నష్టపోయారని, వారికి ఇప్పటి వరకు ఎందుకు పరిహారం చెల్లించలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నుంచి ముఖ్య నేతలంతా ఆ పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరుతుంటే దిక్కుతోచని స్థితిలో ఉన్న కేసీఆర్ ఎండిన పంటల పరిశీలన పేరుతో తిరుగుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ ఉండదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మొరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, సామ అభిషేక్ రెడ్డి, పాశం యాదవరెడ్డి, మేకల రాంబాబు, బింగి శ్రీకాంత్, బైరబోయిన మహరాజు, సైదులు, దిర్శనపు కృష్ణమూర్తి, కొమారి మల్లయ్య, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, రమావత్ భీముడు, నాయకులు నిద్ర సంపత్, డాక్టర్ లక్ష్మణ్, బింగి కృష్ణమూర్తి, అమీనుద్దీన్, రవి, లాలు, భిక్షం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, వీఎల్‌ఓ కేఎస్‌ఎస్. పద్మ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, గోపాలమిత్రలు కుంభం సురేందర్, ఆల్దాస్ లింగయ్య, ఎస్. అర్జున్, రైతులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



శ్రీరామ్

నూతనకల్ : ప్రభుత్వం ప్రకటించిన నవోదయ పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని అల్లునూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన గుండగాని శ్రీరామ్ ఉత్తమ మార్కులు సాధించి నవోదయలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య తెలిపారు. సీటు సాధనకు విద్యార్థినికి అన్ని రకాలుగా తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు రుద్రం మహేందర్, పల్లా సుదర్శన్‌రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్ బహూకరణ



ఫ్రీజర్ బాక్స్‌ను అందిస్తున్న దాతలు

ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కాకి అనంతరెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన 1996–97 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గ్రామపంచాయతీ కార్యాలయానికి ఆదివారం ఫ్రీజర్ బాక్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో నిరుపేదలు మృతిచెందితే ఫ్రీజర్ బాక్స్ తెప్పుకునే స్తోమత లేకపోవడంతో తమ వంతుగా అనంతరెడ్డి జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్ కొనుగోలు చేసి గ్రామపంచాయతీకి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగప్రసాద్, జానయ్య, పవన్, శ్రీకాంత్, ఉపేందర్, గోపాల్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని ర్యాలీ



అర్వపల్లిలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

అర్వపల్లి : పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ అర్వపల్లిలో ఆదివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, పందిరి యుగంధర్, అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, రాచకొండ సురేష్, దుబ్బాక ఎల్లంరాజు పాల్గొన్నారు.

మాస్‌లైన్ నాయకుల ముందస్తు అరెస్ట్



దురాజ్‌పల్లి : సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన మాస్‌లైన్ నాయకులు



మద్దిరాల : మాట్లాడుతున్న పేర్ల నాగయ్య

దురాజ్‌పల్లి : రాష్ట్ర మాజీ సీఎం కే.చంద్రశేఖర్‌రావు సూర్యాపేట జిల్లా పర్యటన సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులను ఆదివారం పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వీరబోయిన రమేష్, మాస్‌లైన్ పార్టీ డివిజన్ నాయకుడు సయ్యద్ తోపాటు ఇతరులను అరెస్ట్ చేశారు.

అక్రమంగా అరెస్టు చేయడం తగదు

మద్దిరాల : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సూర్యాపేట పర్యటన సందర్భంగా ముందుస్తుగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులను అరెస్టు చేయడం తగదని సీపీఐ(ఎంఎల్) జిల్లా మాస్‌లైన్ నాయకుడు పేర్ల నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, జిల్లా కార్యదర్శి వీరబోయిన రమేష్, జిల్లా డివిజన్ నాయకుడు ఎస్‌కె.సయ్యద్‌లను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారని తెలిపారు. కేసీఆర్ 10 ఏళ్ల ప్రభుత్వంలో రాష్ట్రాన్ని ఎన్నో కుంభకోణాలు, అవినీతి అక్రమాలకు అడ్డాగా మార్చారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి వెంటనే దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, కాసర్ల దుర్గయ్య, సూరారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

- కానరాని సేంద్రియ ఎరువులు, వానపాముల ఉత్పత్తి
- రోడ్ల పక్కనే చెత్త పారబోత
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించింది. గ్రామాల్లో చెత్తను సేకరించి యార్డులకు తరలించేలా చర్యలు చేపట్టింది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి.

పెన్‌పహాడ్ మండలంలో ఇలా..

పెన్‌పహాడ్ మండలంలో ప్రతి గ్రామానికి డంపింగ్ యార్డు నిర్మించారు. ఒక్కొక్క డంపింగ్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం సుమారుగా రూ. 2.50లక్షలు ఖర్చు చేసింది. డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారీతోపాటు వానపాములను ఉత్పత్తి చేసేలా ఏర్పాట్లు చేశారు. యార్డుల్లో తయారైన ఎరువును రైతులకు విక్రయిస్తే పంచాయతీలకు కొంత ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావించింది. కానీ చెత్తతో ఎరువు తయారు చేస్తున్నట్లు మచ్చుకైనా కనిపించడం లేదు. డంపింగ్ యార్డుల్లో ఎరువుల తయారీ, వానపాముల ఉత్పత్తిని పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మండలాధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దూపహాడ్‌లో రోడ్డు పక్కన పారబోసిన చెత్త

చర్యలు తీసుకుంటాం



డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి డంపింగ్ యార్డులో ఎరువుల తయారీ తప్పనిసరిగా చేయాలి. నిర్లక్ష్యం వహించే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవు.

- జె. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

నేరేడుచర్ల : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో చిరు వ్యాపారులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు వెంట బట్టలు కుడుతూ జీవనం సాగిస్తున్న ఎస్‌కె మైబెల్లి, రాపోలు శంకర్‌లకు ఎండ నుంచి ఉపశమనం కోసం గొడుగులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవల్లి సత్యనారాయణరెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, జిలకర రామస్వామి, క్రాంతికుమార్, శ్రీని వాస్‌రావు, కనకయ్య, సురేష్, పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.